# ఓటమి గెలిచింది!

"ఉరేయ్! ఉరేయ్ సుబ్బారావ్" అంటూ బోల్డు ఆయాస పడిపోతూ లగెత్తు కొచ్చాడు వెంకట్రావ్, రావిచెట్టు క్రింద బండమీద గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న సుబ్బారావ్ దగ్గరికి.

గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న సదరు సుబ్బారావు ఆయాసపడుతూ పిల్చింది వెంకట్రావేనని గ్రహించ బట్టేనేమో లేనిగోళ్ళని కొరుక్కునే కార్యక్రమంలో పడి తలైనా త్రిప్పి చూడలేదు.

"సుబ్బారావ్ .... సుబ్బారావ్ ...." అంటూ సుబ్బారావుకి అభిముఖంగా వెంకట్రా వెళ్ళి నించునే సరికి తలెత్తి చూడక తప్పిందికాదు సుబ్బారావుకి.

తలెత్తిచూసిన సుబ్బారావు వెంకట్రావు చేతిలోని 'మంటలు' మాసపత్రికను చూసి విస్తుపోయాడు.

"ఏమిటి సంగతి? దానికూడా కథలు రాస్తున్నావా?" అన్నాడు సుబ్బారావు నిర్లిప్తంగా.

"అబ్బే .... హి.... హి .... లేదు" నసిగేసాడు వెంకట్రావు.

"ఏది చూడనీ....నీ కథ పడకుండా ఏ పత్రికనూ వట్టుకొని తిరగవుగా" చురుగ్గా అంటించాడో సిసింద్రీని.

"ఊరుక్కుందూ నువ్వు మరీను."

"పత్రికిలా తే .... ఏంటా బెట్టు"

వెంకట్రావు పత్రికను అందించాడు సుబ్బారావుకి. సుబ్బారావు 'మంటల్ని' తిరగేస్తున్నాడు.

వెంకట్రావు కథకుడు కాదు. కథకుడ్ని కావాలనే తపన అమితంగా కలవాడు. ప్రతి పత్రికా తిరగేసి ఓపిగ్గా చదివి మరింత ఓపికతో ఉత్తరాలుగ్రా రాస్తుంటాడు. ఆ ఉత్సాహంతో రాసిన ఒకటి, రెండు చిన్న చిన్న కథలు చిన్న చిన్న పత్రికలలో పడ్డం జరిగింది. వాటిని వెంకట్రావు బలవంతంగా సుబ్బారావు చేత చదివించడం జరిగింది.

## ఆడారి వెంకటరమణ

వెంకట్రావు కథలు చదివిన సుబ్బారావు వెంకట్రావుని తిట్టాడు. 'నీకథలు సమాజానికేం ఉపయోగపడ్తాయి. నీ వ్యక్తిగత భావచాపల్యాన్ని పాఠకుల నెత్తిన రుద్దాలని చూస్తున్నాయ్. నువ్వు రచయితగా నలుగుర్లోనూ నిలబడాలంటేసమాజంలోని అట్టడుగు మనుషుల మనిషిగా తయారుకావాలి. వాళ్ళ కు

జరుగుతున్న అన్యాయాల్ని ఎత్తి చూపాలి. పాఠకుని నుండి జాలి వీళ్ళ మీద కురిపించాలి. సానుభూతి కలిగించాలి. మధ్యతరగతి మనిషి మనుగడ ప్రస్తుత రోజుల్లో ఎట్లాంటి దారుణ మారణ హోమానికి గురి అవుతుందో ఎత్తి చూపాలి. ఆనాడే నువ్వు రచయితగా పేరు తెచ్చుకోగలవ్.' అని ఇంకా చాలా చెప్పాడు రచయితకు కావలసినవి.

వాటన్నిటినీ విన్నాడు వెంకట్రావు. కథలు రాయలేకపోయాడు. విచారపడ్డాడు. బెంబేలు పడ్డాడు. దొరికిన పుస్తకాన్ని చదివాడు. చదివిందేమిటో ఆలోచించాడు. అలాకాకుండా ఇలా కూడా ఉంటే ఇంకా బావుండేదని తర్జన భర్జనలు చేసుకున్నాడు.

మనిషి బుర్రకు పదును పెట్టే రాజకీయచరిత్రలు, ప్రముఖుల జీవితచరిత్రలు తిరగేసాడు. తిరగేస్తున్నాడు.

అట్టి తరుణంలో 'మంటలు' కంటబడింది; చదివాడు. అందులోని ఓ కథ నచ్చలేదు. ఆ కథలో ఏమి నచ్చలేదో నాలుగు పేజీల ఉత్తరాన్ని ఆ పత్రిక్కి పంపాడు. ఆ ఉత్తరాన్ని పత్రికలో ప్రచురించి ఒక కాపీని ఉచితంగా వెంకట్రావు చిరునామాకి పంపారు పత్రిక వాళ్ళు.

పత్రికవాళ్ళు పంపిన పుస్తకాన్ని విప్పదీసి తన ఉత్తరాన్ని చదూకొని సంబరంగా సుబ్బారావు గురించి గాలించాడు. చెట్టుక్రింద జ్ఞానిలా కనిపించాడు వెంకట్రావుకి సుబ్బారావు.

పుస్తకమంతా తిరగేసి మళ్ళీ మొదట కొచ్చి మూడు నాలుగు నిమిషాలు పుస్తకంలోనికి చూస్తూండిపోయాడు సుబ్బారావు.

సుబ్బారావు తన ఉత్తరాన్ని చదువుతున్నాడని గ్రహించిన వెంకట్రావు తాలూకు మనసు చివుకు చివుకుమంది.

"రచయితన్నవాడు తను రాసింది ఆచరించాలన్న నియమానికి కట్టుబడక్కర లేదంటావ్." రాబోయే తుఫానుకి నాందిగా వీచిన రయ్యిన వచ్చిన గాలిలా వచ్చాయి సుబ్బారావు నోట్లోనుండి ఈ మాటలు.

చక్రం లాటరీమీద పందెం కాసిన కుర్రాడు చక్రం ఇంకా ఆగకుండా తిరుగుతుంటే ఎంతపిలిచినా పలకనట్టే, ఏం మాట్లాడలేదు వెంకట్రావు.

"ఎంత నీతైనా చెప్పొచ్చంటావ్. దొమ్మరిగుడిసెలు దూరచ్చంటావ్."

"అనికాదు నా అభిప్రాయం. దొమ్మరి గుడిసెలు దూరినా – నీతిని ఆచరించమని మరొకడికి చెప్పడం తప్పుకాదంటాను."

"నీ అభిప్రాయం తప్పంటాను. గాంధీగారికి అంత పేరూ, మరొకరి విమర్శకు గురికాకుండా ఉండిన తీరూ– ఎలా అబ్బిందంటావ్ ? చెప్పేవన్నీ ఆచరించేవారు కాబట్టి."

"గాంధీగారి కంటే ఇంకా ఎక్కువ మంది పూజకూ, పునస్కారాలకూ నోచుకున్న భగవాన్ శ్రీకృష్ణుడు ఏం చెప్పాడు ?"

"అదంతా బూటకం. ఓ కవికల్పన. అదో కథ."

"కథలూ కల్పనలూ నిజజీవితం నుండి – సజీవంగా వెలువడ్డాయని

వాదించే వాడివి నువ్వు."

"అప్పుడన్నమాట అన్నిటికీ వర్తించదు. కొన్నిటిలో మాత్రం నిజమే" పుస్తకం మడిచి ప్రక్కన పెడుతూ అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు వాదన బొత్తిగా వెంకట్రావుకు నచ్చలేదు. సుబ్బారావుని తెలివైన వాడికింద లెక్కేసి గౌరవించడం తను చేసిన పొరపాట్లలో ముఖ్యమైందనుకున్నాడు వెంకట్రావు.

తను ఏది రాసినా చీపురు పుల్లను తీసి పారేసినట్లు తీసిపారేయడం వెంకట్రావుకి నచ్చలేదు. ఆ నచ్చకపోవడంతో కొద్దిగా పౌరుషంకూడావచ్చింది.

"నువ్వప్పుడనలేదు అన్నిటికీ వర్తించదని"

"సరే. ఇప్పుడంటున్నానుగా"

"ఇప్పుడంటే ఎలా కుదుర్తుంది ?"

"మరెప్పుడనాలి?"

"ఆ మాటన్నపుడే అనాలి" వెంకట్రావన్నాడు.

"అప్పుడనలేదే నేను"

"అనకపోతే ఎలాగ ?"

"ఎలాగ ?"

ఇలాగ కొంతసేపు తర్జన భర్జనలు జరిగాయి. జరిగింతరువాత వెంకట్రావన్నాడు.

"చెప్పేవన్నీ అందరూ చెయ్యేలేరు."

"అంటే-"

"అర్థం కాలేదా?"

"లేదు"

"లేకపోతే విను. నువ్వు పలానా రచన బాగులేదు అని అనగలవ్. కాని ఎలాగుంటే బావుంటుందో- ఎలా రాసుంటే బావుంటుందో రాసి చూపించలేవ్" అన్నాడు వెంకట్రావు.

సుబ్బారావుకీ మాటవినటంతోటే మరో చిన్న పౌరుషం వచ్చింది.

"అంటే నేను రాయలేననేగా నీ అభిప్రాయం ?"

"అర్థం అయితే మళ్ళీ నన్నడగడం దేనికి ? అన్నాడు వెంకట్రావు.

"నేను రాయగలను, నీకంటే బాగా రాయగలను."

"నువ్వు రాయలేవు, నీలో ఆ ప్రతిభ లేదు"

"చూస్తావుగా"

"చూడను"

"చూస్తావ్"

"ఎప్పుడు చూపెడతావ్ ?"

"రేపే"

"రేపా ?"

"అవును రేపు సాయంత్రానికే"

"తప్పకుండా"

"తప్పకుండా"

ఇద్దరూ ఎవరిదారిన వాళ్లు పోయారు

సూర్యురు పడమర కొండల్లోకి—చంద్రుడు తూర్పుకొండలపైకి అన్నట్టు.

* * *

అన్నమాట ప్రకారం తర్వాతరోజు సాయంత్రం సుబ్బారావు కథ చేత్తో పట్టుకుని వెంకట్రావు గురించి ఎదురు చూస్తున్నాడు రావిచెట్టుక్రింద బండమీద కూర్చొని. ఎంతకీ వెంకట్రావు రాకపోవడం విసుగనిపించింది సుబ్బారావుకి. తనురాసిన కథని మరోమారు చదువుకుందామని కథలోకి తలదూ




ర్చాడు. కథను సాంతం చదివి తలపై కెత్తాడు. అటూయిటూ చూశాడు. ఉహు వెంకట్రావు రాలేదు. కాని రామయ్య గబగబ అడుగులేసుకుంటూ పోతున్నాడు. సుబ్బారావుకి ఏదో గుర్తొచ్చినట్టుంది.

"రామయ్యా" పిలిచాడు సుబ్బారావు.

తప్పదనుకుంటూ రామయ్య వచ్చాడు.

"మా నాన్న మిమ్మల్నో విషయం అడగమన్నారు"

"చిత్తం"

"పద్దెనిమిదొందల పద్దొకటి అలానే ఉంది. దాని సంగతేం తేల్చినట్టు లేదు. ఎప్పుడు తీరుస్తావో అడగమన్నారు"

చిత్తం. ఈ యేడుతో బాకీతీర్చేయాలనుకుంటున్నాం"

"అనుకోవడమే కాదు. తీర్చేయడమే మీకూ మాకూ క్షేమం."

"ఎంతండీ అన్నారు ?"

"పద్దెనిమిదొందలు. రెండొందలు తక్కువ రెండువేలు"

"అన్యాయం దొరా. మీకు ఇవ్వాల్సింది పదొందలేగందా"

"నాకేం తెలవదు. వెళ్ళి నాన్న గారినే అడుగు. ఇదిగో మీ వెంకట్రావు ఇంటిదగ్గరుంటే ఇక్కడికి త్వరగా రమ్మని చెప్పు"

"చిత్తం" రామయ్య కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు.

మరో అరగంట ఆలస్యంతో వెంకట్రావు వచ్చాడు. ఆలస్యానికి క్షమాపణలు చెప్పుకున్నాడు.

మునిపటిలా ఇద్దరూ హాయిగా మన

సులు విప్పి మాట్లాడుకోలేక పోతున్నాడు.

సుబ్బారావు కథని వెంకట్రావుకి అందించాడు. వెంకట్రావు అందుకొని ఒక్కొక్క పేజీ చదూతున్నాడు, తిరగేస్తూ మౌనంగా.

చదువుతున్న వెంకట్రావు ముఖంలోకే గుచ్చి గుచ్చి చూస్తూ అతని మొహంలోని భావాలను చదవడానికి ప్రయత్నిస్తున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు ప్రయత్నాన్ని వెంకట్రావు గమనించాడేమో తన మొహంలో ఎటువంటి భావాన్నీ కనబడనీయకుండా జాగ్రత్తపడుతున్నాడు. పావుగంట పట్టింది కథను పూర్తిగా చదివేసరికి వెంకట్రావుకి.

కాగితాలను సుబ్బారావుకి అందించాడు వెంకట్రావు. వెంకట్రావు ఏం మాట్లాడకపోవడం చూసి "గెలుపెవరిదో తేల్చుకోవడానికి పట్నంపంతులు దగ్గిర కెళ్ళాలా ?" అన్నాడు సుబ్బారావు.

"అఖ్లేదు. కథలు నాకంటే నువ్వే బాగా రాయగలవ్. నువ్వే గెలిచావ్. కాని నీ గెలుపే నిన్ను చిత్తుగా ఓడించింది" అన్నాడు వెంకట్రావు.

అతని మాటలు ఏ విధంగానూ అర్థం కాలేదు సుబ్బారావుకి.

"అర్థమయ్యేలా మాట్లాడు" సుబ్బారావన్నాడు బితుకు బితుకుమనే మనసుతో.

"కథలు నాకంటే బాగా రాయగలనని నిరూపించుకొని గెలిచావ్. నువ్వు గెలిచింది ఒక్కసారే. కాని ఓడింది రెండుసార్లు."

"వివరంగా మాట్లాడు" అసహనంగా పలికాడు సుబ్బారావు.

వెంకట్రావు అందుకున్నాడు—

"కథలోని కొద్దాం. కథ పేరు ..." "సింహాసనం - శునకం" కథకు పేరు అతికినట్టూ సరిపోయింది. ఒక పేదవాడికి - త్రాగడానిక్కూడా గంజిలేని నీ భాషలో 'ముష్టివెధవ'కి కనికరించి కూలి పనిచ్చిన ఎస్టేటు సర్వాధికారి భూషణరావు కూతురికి ఆ ముష్టి వెధవ కోటేసు కన్ను కొట్టడం - దాన్నా అమ్మయి పట్టించుకోక పోవడం, కోటేసు కొన్నాళ్ళకు మేస్త్రీ కావడం - భూషణరాజు ఆస్తిని కాజేయడంలో దుండగులకి సహాయపడ్డం - చివరిగా భూషణరావు కూతురు గుడ్డిదని తెలియడం బావుంది చాలా బావుంది. కాని ఒక్క ప్రశ్న.

"ఈ కథలో నువ్వేం చెప్పావ్ ? పేదవాడిని ఎవ్వరూ కనికరించి పనివ్వకుంటే - వాళ్ళందరూ దొంగలూ - కాముకులూ - మీ అమ్మాయిల్ని ఏమైనా చేసేస్తారూ ? లేకపోతే మీఆస్తిని కాజేస్తారూ తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించావ్.... అంతేనా?"

"అట్టడుగు మనిషి సమస్యల్ని ఎత్తిచూపి- వాళ్ళు ఎంతటి తీరని వ్యథలతో కుమిలిపోతున్నారో వాళ్ళ బాధల్ని ఎలుగెత్తి చాటమన్న నువ్వు ఏం రాసావ్? వాళ్ళెంతటి దారుణమారణహోమానికి గురౌతున్నారో చెప్పమన్న నువ్వు ఏం చెప్పావ్! నువ్వు నాకు చెప్పావ్- అట్టడుగు మనుషుల మని




షిపై రాయి అని, కాని చెయ్యలేక పోయావ్.

"నువ్వు చెప్పింది చెయ్యలేక పోయావ్. నువ్వెందుకు ఆ అట్టడుగు మనిషికి చేయూతివ్వలేకపోయావ్. ఇవ్వకపోతే పోయింది ఎందుకు వాడికి అన్యాయం చేసావ్?" వెంకట్రావు మాటలు వింటూ ఎటో చూస్తూండి పోయాడు సుబ్బారావు.

"సరే! అదలా ఉంచు మీ నాన్న చేసేదేంటీ? వడ్డీవ్యాపారం. ఆ వ్యాపారంలో అడ్డంగా రెట్టింపులు సంపాదిస్తున్నాడన్న విషయం నీకుతెల్సు. వ్యాపారంలో ఇంకాకొన్ని కిటుకులు నేర్చుకోడానికి నిన్ను బి. కాం. చదివించాడు, నువ్వు మీనాన్నకు ఈ విషయంలో సహాయపడుతున్నావ్, నీకు తెలీకపోతే నీ అంతరాత్మనడుగు. రెండు వందలు ఇచ్చి పద్దెనిమిదొందలు తీసుకోడం అంటే ఏమిటి? అన్యాయం! అక్రమం!! వెట్టి!!!

"మా నాన్న మీ దగ్గర ఎప్పుడో రెండువందలు తీసుకున్నమాట నిజమే కావచ్చు. కాని అవి క్రిందటి సంవత్సరానికి వెయ్యి అయింది. ఇప్పటికి పద్దెనిమిదొందలు అయింది. ఈ ఋణం ఎన్ని జన్మలకు తీరుతుంది? .... మా కుటుంబం అంతా ఏదో ఒక రోజు ఏ ఎండ్రినో త్రాగి చచ్చేంత వరకూ — కాలే మా శవాలతో పాటే ఆ అప్పు

అంతమవుతుంది. ఇవన్నీ నీకు తెలీనివా? తెలుసు — మీ నాన్న మూలంగా జరిగే అన్యాయాలన్నీ నీకు తెలుసు. కానీ, నోరు మెదపవు. పై పెచ్చు చేయూత నిస్తున్నావ్.

"సోషలిజం గురించి గ్రుక్క త్రిప్పుకోకుండా మూడు రోజులు మాట్లాడగలవు ఎంతో మంచిదంటూ. సోషలిజం ఎలా వస్తుంది? సమసమాజ స్థాపన ఇంకెలా జరుగుతుంది?? మా నాన్నలాంటి అమాయక ప్రజల్ని దోచుకున్న సొమ్మంతా రేపు ప్రభుత్వ పరమవుతుంది. 'వెట్టి' విధానాన్ని అవలంభించే మీ 'దొర'తనం, – 'దొంగ' తనం అని నిరూపణవుతుంది. అప్పుడు మీరందరూ దొంగలుగా సామాన్య ప్రజల ఎదుట చేతులు కట్టుకొని, తలొంచుకుని, సిగ్గుని విడిచినించోవాలి. వాళ్ళ నోటినుండి వెలువడే పచ్చి బూతులకు బాధ్యులు కావాలి."

"నువ్వుచెప్పింది నీతి, దూరింది దొమ్మరిగుడిసె. నువ్వు చెప్పింది నువ్వు ఆచరించకపోయినా నా ఆచరణకు పూనాది వేసింది. ఈరోజు నాముందు నువ్వింత చేతకాని వాడిలా నించోడానికి కారణం నీ ప్రేరణ. నీతి చెప్పే దెవడయినా, ఎలాంటి వాడైనా – అందర్నీ కాకపోయినా కొందర్నయినా మారుస్తుంది. క్రొత్త సృష్టికి స్వాగతం పలుకుతుంది" వెంకట్రావు మాటల్ని ఇంకా వినదల్చుకోని ...వినే అవసరం లేని నిర్ణయం తీసుకుని ఇంటి ముఖం పట్టాడు సుబ్బారావు.

---

## మిగిలిన మాణిక్యాలు

మన దేశం కోసం పాటు పడిన నిస్వార్ధ దేశసేవకులు, శతవృద్ధులు, అనేక మంది ఈ మధ్యనే కాల ధర్మం చెందారు. అదృష్టవశాత్తు అలాంటి మహానుభావుల్ని కొందర్ని మనం చూడగలిగాము. పదవీవిరమణ చేసి విశ్రాంతి తీసుకునే నాయకుల్ని ఆట్టే పట్టించుకోరు జనం. ఐతే వారిగురించి బాగా తెలుసుకున్నా, వారు మరణించిన వార్త పత్రికల్లో చూశాకనే – పోయిన వారిగుంచి సంతాప సభలూ, ఛాయాచిత్రావిష్కరణలూ, విగ్రహప్రతిష్టలు ఊరేగింపులు మొదలైనహడా విడిచేసి మనం విచారప్రకటన చేస్తాం. ఇంకా బ్రతికివున్న, "మిగిలిన మాణిక్యాలు" కొందరున్నారు. వారినిగురించి ఎప్పుడైనాగుర్తు చేసుకోవడం మన కర్తవ్యం,

ప్రస్తుతం విశాఖ జైలులో వున్నతెన్నేటి విశ్వనాధంగారు,

అనారోగ్యంగా వున్న దుర్గాబాయిగారు,

తిరగగల్గినంత వరకు అనేకసాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టే బెజవాడ గోపాలరెడ్డిగారు,

ఇంకా సంఘసేవ చేస్తున్న అమ్మన్న రాజాగారు, కేవలం రాజకీయాల్లోనే కాక అనేక రంగాల్లో అద్వితీయులని పించుకున్న వారు, కళాకారులు మిగిలేవున్నారు. ప్రతీసంచికలోనే అలా "మిగిలివున్న మాణిక్యాలు" గురించి మీకు తెలిసినవివరాలు మాకుపంపండి ప్రచురించి ఆవింతంగా జాతిరత్నాలకి కృతజ్ఞతలు తెలియచేసు కొందాము.